క్లుప్తంగా

టౌన్ బ్యాంక్ ఎండీకి సన్మానం



తిరుపతి టౌన్ బ్యాంక్ ఎండీని సన్మానిస్తున్న పాలకవర్గం, యూనియన్ నాయకులు

తిరుపతి కల్చరల్: తిరుపతి కో–ఆపరేటివ్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్‌గా డి.శివకుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రా రెడ్డి, డైరెక్టర్లు, యూనియన్ నాయకులు ఆయనను సత్కరించి అభినందించారు.

గంగమ్మకు బోనాలు



విశేషాలంకరణలో అమ్మవారు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మకు శ్రావణ మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు అంబలి పంపిణీ చేశారు.

సింగపూర్‌లో తిరుపతి వాసి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

సోమల: సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న తిరుపతి వాసి గుండెపోటుకు గురై మరణించినట్లు ఆలస్యంగా తెలిసింది. వివరాలు.. తిరుపతికి చెందిన మారిశెట్టి శ్రీనివాసులు సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతనికి మండలంలోని గుంతచెరువుపల్లెకు చెందిన ఎల్‌ఐసీ శంకర కుమార్తె హేమలతతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె సంతానం. గత నెల 29న శనివారం సింగపూర్‌లో అతను గుండెపోటుకు గురై మరణించాడు. బుధవారం సింగపూర్ నుంచి అతడి మృతదేహం గుంతచెరువుపల్లెకు తీసుకువచ్చి అంత్యక్రియలు చేయనున్నట్టు గ్రామస్తుల ద్వారా తెలిసింది. శ్రీనివాసులు స్థానికంగా భూములు కొని ఉండడంతో ఆ ప్రాంతంలో అంత్యక్రియలు చేయనున్నట్టు తెలుస్తోంది.

కనుల పండువగా ఊంజల్‌సేవ



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్ సేవ కనులపండువగా జరిగింది. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపుగా స్వామి, అమ్మవారిని ఊంజల్‌సేవ మండపానికి తీసుకొచ్చారు. వేద మంత్రోచ్చరణల మధ్య ఊంజల్‌సేవ జరిగింది. వెన్నెల కాంతుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: మండలంలోని ఆలయాల్లో మంగళవారం పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. సొరకాయలస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లక ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శింగిరికోనలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ధన్వంతరి, లక్ష్మీ హోమాలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామికి కల్యాణాన్ని నిర్వహించారు. కైలాసనాథకోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమంలో పౌర్ణమి పూజలను నిర్వహించారు.

దేశమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

నగరి : నేత్ర దేవత దేశమ్మకు ఆడి నెల మంగళవారం ప్రత్యేకం కావడంతో ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయానికి విచ్చేసిన భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ముందున్న అమ్మవారి పాదుకల వద్ద పొంగళ్లు ఉంచి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులను నియంత్రించడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని తీర్థం కళ్లలో చల్లుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ మునికృష్ణయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కౌన్సిలర్ దయానిధి, లోకనాథం, సేదు తదితరులు ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటు

- ట్రాఫిక్ కష్టాలు తొలగించేందుకే మాస్టర్‌ప్లాన్ రోడ్లు
- దేశమే మెచ్చేలా తిరుపతి నగరాభివృద్ధి
- ఓర్వలేకే టీడీపీ, జనసేన, బీజేపీ విమర్శలు
- కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం
- ఆ పార్టీ నాయకుల దిష్టి బొమ్మల దహనం





టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల తీరును నిరసిస్తూ వారి దిష్టిబొమ్మలను పాడెపై ఊరేగించి శ్మశానంలో దహనం చేస్తున్న కార్పొరేటర్లు, యువజన, విద్యార్థి నాయకులు

తిరుపతి మంగళం/తిరుపతి కల్చరల్: ''తిరుపతి చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా నగర అభివృద్ధి జరుగుతోంది. ఆధ్యాత్మిక నగరానికి మణిహారంలా మాస్టర్‌ప్లాన్ రోడ్లు, సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఎస్వీ యూనివర్సిటీ, జూపార్క్ రోడ్డును కలుపుతూ నిర్మిస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డు అడ్డుకుంటున్నారని'' వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, నాయకులు, విద్యార్థి సంఘాల నేతలు మండిపడ్డారు. మంగళవారం బాలాజీకాలనీలోని జ్యోతిరావ్‌పూలే విగ్రహం వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ రాజకీయ కుట్రలను తిప్పికొట్టేందుకు వినూత్న నిరసన చేపట్టారు. టీడీపీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, ఆర్‌సీ మునికృష్ణ, జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి, బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్ ఫొటోలతో కూడిన దిష్టి బొమ్మలను పాడెపై పెట్టి ఎస్వీ యూనివర్సిటీ మీదుగా బాలాజీకాలనీలోని శ్మశానం వరకు ఊరేగించారు. కట్టెలపై వారి దిష్టిబొమ్మలను పెట్టి దహనక్రియలు చేశారు. అభివృద్ధిని అడ్డుకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. మంచి పనులు చేస్తే సహకరించాల్సిందిపోయి అడ్డుపడడం సబబు కాదని పేర్కొన్నారు. ఇలాంటి వాళ్లు ఉన్నా ఒక్కటే, లేకున్నా ఒక్కటే అంటూ విమర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరేంద్ర, బోకం అనిల్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యులు ఎస్‌కే. ఇమామ్‌సాహెబ్, పార్టీ నాయకులు ఉదయ్ వంశీ, ఊతుకుంట మోహన్, ఇమ్రాన్‌బాషా, దినేష్‌రాయల్, ఉదయగిరి రమేష్, రాజేష్‌రెడ్డి, అనిల్, ప్రేమ్‌కుమార్, గీతాయాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధి వద్దనుకుంటే మహానగరాలయ్యేనా..?

ఆ రోజుల్లో ఉన్న ఊర్లు, వాడలను అభివృద్ధి చేయకుండా ఉంటే ఈ రోజు ప్రపంచం ఇంత అభివృద్ధి చెంది ఉండేదా.! సముద్రంపై వంతెనలు కడుతున్న ఈ రోజుల్లో ఎస్వీ యూనివర్సిటీలో నిర్మిస్తున్న మాస్టర్‌ప్లాన్ రోడ్డును టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటు. ఎస్వీయూలో దివంగత సీఎం వైఎస్సార్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, చంద్రబాబు కూడా ఇక్కడ చదువుకున్న వారే. ఎస్వీయూలో మాస్టర్‌ప్లాన్ రోడ్డు వేయడం వల్ల వచ్చే నష్టమేమిలేదు.

– అజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

మణిహారంలా మాస్టర్‌ప్లాన్ రోడ్లు

మాస్టర్‌ప్లాన్ రోడ్లు తిరుపతి నగరానికే మణిహారంలా నిలిచాయి. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తిరుపతి అభివృద్ధికి శ్రమిస్తున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు, కొర్లగుంట రోడ్డు విస్తరణ, ఫ్రీలెఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. నగర ప్రజలంతా మాస్టర్‌ప్లాన్‌రోడ్లు, అభివృద్ధిపై ప్రశంసలు కురిపిస్తుంటే టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు మాత్రం నగర అభివృద్ధి చెందడం ఇష్టం లేనట్లు ఉంది.

– రామస్వామి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్

ప్రజలే బుద్ధి చెబుతారు

టీడీపీ 14 ఏళ్ల పాలనలో తిరుపతిలో చిన్నపాటి అభివృద్ధి కూడా జరగలేదు. నాలుగేళ్లలోనే నగర అభివృద్ధి జరగడాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. దొంగలంతా ఒక్కటై అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటు. ప్రజల్లో భూమన అభినయ్‌రెడ్డికి వస్తున్న మంచిపేరు చూసి తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారు. ప్రజలే రోడ్లపైకి వచ్చి వారికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

– వాసుయాదవ్, టౌన్‌బ్యాంక్ వైస్‌చైర్మన్

స్వార్థ రాజకీయాలు టీడీపీకి అలవాటే



మాట్లాడుతున్న స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు

తిరుపతి కల్చరల్: నిరంతరం ప్రజాసంక్షేమం, తిరుపతి నగర అభివృద్ధే లక్ష్యంగా శ్రమిస్తున్న ఘనత ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుటుంబానికే దక్కుతుందని స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే.బాబు అన్నారు. గత టీడీపీ హయాంలో నగరాభివృద్ధిని విస్మరించి ఇప్పుడు నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టి నాలుగున్నర ఏళ్లు కావస్తున్నా ఇందులో రెండేళ్లు కరోనా కష్టాలు కాగా కేవలం రెండేళ్లలో తిరుపతిని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఏనాడు తిరుపతి అభివృద్ధి గురించి పట్టించుకోకుండా దోచుకోవడమే పాలన అనేలా వ్యవహరించారని దుయ్యబట్టారు. ఎస్వీ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న మూడు రోడ్లలో గతంలో మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రెండు రోడ్లతో పాటు మరో రోడ్డును ప్రస్తుతం ఏర్పాటు చేస్తుంటే దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నించడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. గతంలో లక్ష్మీపురం సర్కిల్‌లోని రెండు ఎకరాల శ్మశాన స్థలం మఠం భూమిని మఠం అధికారులతో ఒప్పించి శ్మశానానికి వినియోగిస్తుంటే తనకు ఏ మాత్రం సంబంధం లేని టీడీపీ నేత సూరా సుధాకర్ దానిపై కోర్టులో స్టే తేవడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. తిరుపతి అభివృద్ధిపై పసలేని విమర్శలు మాని టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధి, వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిపై చర్చకు టీడీపీ నేతలు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, నాయకులు నల్లానిబాబు, రాపూరిప్రసాద్, అమరనాథ్‌రెడ్డి, సురేష్, కుమార్, గురవయ్య ఉన్నారు.

అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారు



మాట్లాడుతున్న గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్

తిరుపతి కల్చరల్: తిరుపతి అభివృద్ధిని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు పనిగా పెట్టుకున్నాయని తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నగరంలో 20 శాతం భూభాగం కలిగిన ఎస్వీ యూనివర్సిటీలో జూపార్క్‌ను కలిపే రహదారులే లేవన్నారు. నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే వర్సిటీలో మాస్టర్ ప్లాన్ రోడ్డుకు పూనుకున్నామని తెలిపారు. గతంలో టీడీపీ, దాని మిత్రపక్షాలు తిరుపతిని సింగపూర్ చేస్తామని చెప్పి విస్మరించారని ఎద్దేవా చేశారు. తమ నాయకుడు డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి అభివృద్ధికి కృషి చేస్తుంటే ఓర్వలేక అడ్డుకునే ప్రయత్నం చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు క్రిష్ణమూర్తి, బాలాజీ, వెంకటేశ్వర్లు, ధనశేఖర్, కుమార్, కార్పొరేటర్ బాలసుబ్రమణ్యం ఉన్నారు.

సేవకులుగా పనిచేస్తాం.. ఆశీర్వదించండి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు సేవకులుగా పనిచేస్తామని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని సొరకాయలపాలెం పంచాయతీ చల్లావారిపల్లి, పూజావారిపల్లి, కమ్మపల్లి దళితవాడలో గడప గడపకు మీ హర్షిత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నియోజకవర్గ ప్రజలను సొంత కుటుంబంగా భావించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కవితా, భాస్కర్‌యాదవ్, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, మునీంద్రబాబు, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, నాయకులు మహేంద్రరెడ్డి, బాబు యాదవ్, తాతిరెడ్డి వెంకటరెడ్డి, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నా మునెమ్మకు ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: బీసీ నాయకుడు అన్నా రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ అన్నా రామకృష్ణ తల్లి అన్నా మునెమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొర్లగుంటలోని అన్నా రామచంద్రయ్య నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ప్రజారోగ్యమే లక్ష్యం



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తిరుపతి మంగళం: చంద్రగిరి నియోజకవర్గంలో ప్రజా సంక్షేమంతో పాటు ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా కృషి చేస్తున్న గొప్ప నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ రణధీర్‌పురం పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. మంగళం రణధీర్‌పురం పంచాయతీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం మంగళవారం ముగిసింది. వైద్య శిబిరంలో సుమారు 2వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు మందులు అందజేశారు. రూ. 4వేలు విలువ చేసే వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందించడంపై స్థానికులు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లెమొగ్గల ఉమాపతి, నాయకులు రజాక్, వార్డు సభ్యులు సతీష్, మురళి పాల్గొన్నారు.

వేడుకగా మహా చండీహోమం



మహా పూర్ణాహుతిలో ఆలయ చైర్మన్, ఈఓ

తిరుపతి కల్చరల్: శ్రావణ మాసం పౌర్ణమి సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం మహా చండీహోమం వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ గుండంలో పూజాది కార్యక్రమాలు చేపట్టి శాస్త్రోక్తంగా మహా చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈఓ మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు వెంకటేశ్వరరావు, ధనశేఖర్, కృష్ణమ్మ, భారతి పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు





దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, నటుడు తనికెళ్ల భరణి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని మంగళవారం రాత్రి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఎస్‌ఓ శైలేంద్ర బాబు, ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ మధుసూదన్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మ వారి కుంకుమ సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వారికి వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జమేదార్ ధనుంజయుడు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అశోక్, గణేష్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు ఉన్నారు.

కుటుంబ సమేతంగా వచ్చిన తనికెళ్ల భరణి

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి, ఇన్‌స్పెక్టర్ అశోక్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సాంకేతిక అంశాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ రాజారెడ్డి

తిరుపతి సిటీ: విద్యార్థులు సమాచార, సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్వీయూ వీసీ కె రాజారెడ్డి అన్నారు. మంగళవారం గ్రంథాలయ అప్రెంటీస్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు తన చాంబర్‌లో ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రంథాలయ కోర్సును పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎస్వీ యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం ఆధ్వర్యంలో ఏడాది పాటు అప్రెంటీస్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో విద్యార్థులు గ్రంథాలయ నిర్వహణలో మంచి నైపుణ్యం సాధిస్తారని పేర్కొన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ హుస్సేన్, గ్రంథాలయ అధికారి సురేంద్రబాబు పాల్గొన్నారు

ట్రాన్స్‌కో ఉద్యోగులకు ఐఎఫ్‌టీయూ మద్దతు

తిరుపతి కల్చరల్: సమస్యల పరిష్కారం కోసం ట్రాన్స్‌కో ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.హరికృష్ణ తెలిపారు. మంగళవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



తల్లిపాల విశిష్టతపై అవగాహన ర్యాలీ

రామచంద్రాపురం: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని కుప్పంబాదూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. మంగళవారం మండలంలోని సొరకాయలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. తల్లిపాల విశిష్టతపై ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు తాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని చెప్పారు.